
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
17-6-2026 (Wednesday) MAIN EDITION

## బడుల్లో గాయత్రీ మంత్రం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నీ తమ పని దినాన్ని నిర్దిష్ట ప్రార్థనలు, కీర్తనలు, దేశభక్తి గీతాలతో ప్రారంభించి, ముగించాలని ఆదేశించింది. పాఠశాలలు రోజువారీగా పాటించాల్సిన మూడు దశల కార్యక్రమ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ప్రతి విద్యా సంస్థలోనూ గాయత్రీ మంత్రంతో పాటు ఇతర హిందూ ప్రార్థనలు, జాతీయ గీతం, వందేమాతరం పఠనాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## యుద్ధంలో 'గ్రోక్' ఏఐ సాయం..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ తన యుద్ధ తంత్రాల్లో సరికొత్త మార్పులు తీసుకువచ్చింది. ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ఏఐ' సంస్థ అభివృద్ధి చేసిన 'గ్రోక్' అనే కృత్రిమ మేధస్సును తాము యుద్ధ ఆపరేషన్లలో సమర్థవంతంగా వాడుతున్నట్లు అమెరికా రక్షణశాఖ అధికారికంగా ప్రకటించింది. 'ప్రాజెక్ట్ మావెన్'లో భాగంగా గ్రోక్ ఏఐని ఉపయోగిస్తున్నామని పెంటగాన్ ఏఐ చీఫ్ కామెరూన్ స్టాన్లీ వెల్లడించారు. తాజాగా ఇరాన్‌తో జరిగిన ఘర్షణల్లో ఈ ఏఐ సాయంతో కేవలం 96 గంటల వ్యవధిలోనే 2,000 లక్ష్యాలను గుర్తించి, వాటిని పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి





**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వడోదర - జరోద్ రోడ్డుపై ఒక బస్సు ట్రక్కును వెనుక ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. మరో ఎనిమిది మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెక్సాస్ హైవేపై కూలిన విమానం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలోని టెక్సాస్ హైవేపై విమానం కుప్పకూలింది. ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. విమానం రోడ్డుపై పడడంతో పలు వాహనాలు ధ్వంసమై, మంటలు చెలరేగాయి. పోలీసులు, స్థానికులు వెంటనే స్పందించి కాక్పిట్ అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను రక్షించారు.

## షబ్బీర్ అలీకి మద్దతుగా వెలిసిన ఫ్లెక్సీలు



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి మద్దతుగా గాంధీభవన్‌లో ఫ్లెక్సీలు వెలిశాయి. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడంలో కీలకపాత్ర పోషించిన నేతగా షబ్బీర్ అలీని ప్రశంసించారు. 'నిజం ఎప్పటికీ మరుగున పడదు.. నిజమైన నాయకుడిని ఎవరూ తక్కువ చేయలేరు' అనే సందేశాలతో ఫ్లెక్సీలు కనిపించాయి.

## పానీపూరి తిని 20 మంది చిన్నారులకు అస్వస్థత



**అక్షరటుడే, సిరిసిల్ల:** సిరిసిల్ల జిల్లాలో పానీపూరి తిని 20 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. కేసీఆర్ నగర్ కాలనీలో ఒక బండి వద్ద పానీపూరి తిన్న చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, తీవ్రమైన జ్వరం లాంటి లక్షణాలు కనిపించడంతో తల్లిదండ్రులు వారిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చిన్నారుల్లో రిషికేష్ అనే బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాలుడికి తీవ్ర స్థాయిలో జ్వరం రావడంతో ఫిట్స్ వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన నలుగురు పిల్లల్లో ముగ్గురు పానీపూరి తిని అస్వస్థతకు గురైనట్లు ఓ మహిళా ఆవేదన వ్యక్తం చేసింది. అస్వస్థతకు గురైన మిగతా చిన్నారుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ బడులు



**రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.**

—అక్షరటుడే, హైదరాబాద్

■ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ■ ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ■ ప్రతిపక్షాలపై విమర్శలు

రాష్ట్రంలోని 24 వేల పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్యను అందించడానికి విద్యాశాఖపై రూ. 27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఆరుట్ల స్కూల్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరడం సంతోషకరమని, ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి పాఠశాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

**స్కిల్ యూనివర్సిటీ..**

ఏఐ యుగంలో విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా, డిసెంబర్ 9న 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ప్రారంభించబోతున్నట్లు సీఎం వెల్లడించారు. భవిష్యత్తులో విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. గత ప్రభుత్వం కులాల వారీగా పాఠశాలలు పెట్టి విభజనను ప్రోత్సహించిందని, ఆ కుల వ్యవస్థను నిర్మూలించేందుకే తాము 'ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు' నిర్మిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**విమర్శలపై ఆగ్రహం**

ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు పిలిపించడంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సీఎం ఖండించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను తప్పుబట్టడం వారి కుసంస్కారానికి నిదర్శనమని మండిపడ్డారు. 2034 ఒలింపిక్స్‌లో తెలంగాణ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించేలా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం నాణ్యమైన విద్యా కిట్లను అందజేస్తుంటే, కొందరు పనిగట్టుకుని అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

**"భవిష్యత్తు నాయకులు మీరే"..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులే రేపటి దేశ నాయకులని సీఎం అన్నారు. తల్లి దండ్రులు ఆత్మగౌరవంతో బతికేలా విద్యార్థులు కష్టపడి చదవాలని, గొప్ప స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం పాఠశాల వసతులను పరిశీలించడమే కాకుండా, విద్యార్థులతో కలిసి సరదాగా గడిపారు. ఉన్న కిచెన్, ల్యాబ్స్, లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌రూంలను పరిశీలించారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.

## తెలంగాణ ఇజ్జత్ తీస్తున్న సీఎం: కవిత



**అక్షరటుడే, మంచిర్యాల:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి సందర్శించారు. అనంతరం హెచ్ఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయడమే పనిగా పెట్టుకున్నారని కవిత విమర్శించారు. ఢిల్లీకి అప్పు కోసం పోతే చెప్పులు ఎత్తుకుపోయే వాళ్లను చూసినట్లు చూస్తున్నారన్నారని గుర్తు చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన ఫోన్ ఎత్తడం లేదని చెబుతారన్నారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడుతారా అని ఆమె ప్రశ్నించారు. ఆయన బేలా మాటల కారణంగానే ఆంధ్రాలో ఉండే నాయకులు మనపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

## హరీశ్‌రావుకు మంత్రులు పొన్నం, అడ్లూరి కౌంటర్



**అక్షరటుడే, హైదరాబాద్:** గురుకుల పాఠశాలల టెండర్లలో భారీ స్కామ్ జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించిన విషయం తెలిసిందే. ఆయనకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్ వారు బుధవారం మాట్లాడారు. కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో గతంలో వెంకట్ స్వామి, చొక్కారావు ఎలాంటి రాజకీయాలు చేశారో ఇప్పుడు తాను, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అలాంటి రాజకీయాలు చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజకీయాల్లో ఆదర్శంగా ఉన్నామని చెప్పారు. సంక్షేమ శాఖల్లో మొత్తం సెంట్రల్ ప్రొక్యూర్ మెంట్ టెండర్లు రూ.2వేల కోట్లు కానప్పుడు 2 వేల కోట్ల స్కాం జరిగిందని ఎలా అంటారని ప్రశ్నించారు. తాము పారదర్శకంగా ఉన్నామని పొన్నం తెలిపారు. అవినీతి చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు.

## అన్నదాతలకు గుడ్‌న్యూస్.. త్వరలో రైతు భరోసా




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెలాఖరులోగా రైతు భరోసా జమ చేస్తామని తెలిపింది. రాష్ట్రంలో వానాకాలం సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ఎరువులు, విత్తనాలు, ఇతర ధరలు పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి సాయం కోసం నిరీక్షిస్తున్నారు. యాసంగి సీజన్‌లో ప్రభుత్వం ఆలస్యంగా రైతు భరోసా విడుదల చేసింది. అది కూడా రెండు ఎకరాల వరకే నిధులు జమ చేసింది. దీంతో వానాకాలంలోనైనా సకాలంలో డబ్బులు వస్తాయా లేదా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల చివర వరకు రైతు భరోసా విడుదల చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

## అభిమానిని పరామర్శించిన పవన్



**అక్షరటుడే, వరంగల్:** అరుదైన వ్యాధితో బాధ పడుతున్న చిన్నారి అభిమానిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. హన్మకొండలోని హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల నిరంజన్ జన్యు పరమైన వ్యాధితో మంచానికే పరిమితం అయ్యాడు. నిరంజన్ పవన్ అభిమాని. తన చివరి కోరికగా పవన్ కల్యాణ్‌ను కలవాలని కోరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పవన్ బుధవారం హన్మకొండకు వచ్చారు. నిరంజన్ ఇంటికి వెళ్లి కలిశారు. తన అభిమాన నటుడిని కలవడంతో అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్, మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. వేంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన టెలిగ్రామ్




**అక్షరటుడే, ఢిల్లీ:** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ ఉదంతం నేపథ్యంలో.. పరీక్షా పత్రాల లీకేజీని, తప్పుడు వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. జూన్ 21న జరగనున్న నీట్ రీటెస్ట్ ముగిసే వరకు అంటే జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. టెలిగ్రామ్‌లోని 'మెసేజ్ఎడిటింగ్' ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ, పాత మెసేజ్‌లను మార్చి నకిలీ సాక్ష్యాలను సృష్టిస్తున్నారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గుర్తించింది. దీనిని నివారించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్‌ను నిషేధించినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని, నిందితులపై చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. నిషేధాన్ని సవాలు చేస్తూ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. అత్యవసరంగా విచారణకు స్వీకరించిన హైకోర్టు కీలక పరిశీలన చేపట్టింది.

## వరుస ఛాన్స్‌లతో నివేదా బౌన్స్ బ్యాక్..



టాలీవుడ్‌లో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో అంచనా వేయడం కష్టం. ఒకట్రెండు ఫ్లాపులు పడినా లేదా కాస్త గ్యాప్ వచ్చినా ఇక ఫేడౌట్ అయిపోయారని డిసైడ్ చేసేస్తారు. టాలెంటెడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ విషయంలో కూడా రీసెంట్‌గా ఇలాంటి కామెంట్స్ బాగా వినిపించాయి. ఈ క్రమంలో సడెన్‌గా రెండు భారీ ప్రాజెక్ట్స్ లైన్‌లో పెట్టి ఇండస్ట్రీకి పెద్ద షాక్ ఇచ్చింది ఈ బ్యూటీ. తెలుగులో మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురంలో లాంటి సక్సెస్ ఫుల్ సినిమాల్లో నటించింది. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో బ్రేక్ రాలేదు. ఆమె కెరీర్ పూర్తిగా స్లో అయిపోయినట్లే అనిపించింది. ఈ క్రమంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్షన్ రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నివేదా ఛాన్స్ కొట్టేసింది. ఇక మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న మెగా158 ప్రాజెక్ట్‌లో ఒక ముఖ్యమైన పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది. ఇలా వరుస ఛాన్స్‌లు దక్కించుకుని మళ్లీ బౌన్స్‌బ్యాక్ అయ్యింది. - అక్షరటుడే, సినిమాడెస్క్